క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

అమలాపురం టౌన్: ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకూ పట్టణంలోని పలు వార్డులకు సంబంధించి ఆధార్ మొబైల్ క్యాంపులు ఆయా వార్డు సచివాలయ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నట్లు అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకునేందుకు ఆ వార్డుల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 1, 30 వార్డులకు సంబంధించి ఈ నెల 20న మెట్ల కాలనీ వార్డు సచివాయలంలో ఆధార్ మొబైల్ క్యాంపు అందుబాటులో ఉంటుందన్నారు. 21న వంటెద్దు స్ట్రీట్ వార్డు సచివాలయంలో ఉండే మొబైల్ క్యాంపును 2, 3, 4 వార్డుల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 27న కల్వకొలను స్ట్రీట్ వార్డు సచివాలయంలో 5, 6 వార్డులకు, 28న అశోక్‌నగర్ వార్డు సచివాలంలో 7, 8 వార్డులకు, 29వ తేదీన మహిపాల స్ట్రీట్ వార్డు సచివాలయంలో 9, 10 వార్డుల ప్రజలకు మొబైల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు.

కానిస్టేబుల్ వీరబాబుకు అభినందనల వెల్లువ


కానిస్టేబుల్ వీరబాబును సత్కరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: ఎదుర్లంక వారధి నుంచి నదిలో దూకి ఆత్మహత్మకు యత్నించిన యువతిని రక్షించిన ఏఆర్ కానిస్టేబుల్ అంగాని వీరబాబుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డితో పాటు పలు సంస్థల ప్రతినిధులు కానిస్టేబుల్ వీరబాబును సత్కరించి అభినందించారు. స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి కానిస్టేబుల్ వీరబాబును ఆదివారం ఉదయం సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, కుడుపూడి శ్రీనివాసరావు, నుగ్గు ప్రసాద్, గంటి ప్రవీణ్, పేరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

గుబ్బలకు ఘన నివాళి



సత్యనారాయణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

అల్లవరం: స్థానిక గుడివానిచింత వద్ద సత్యకస్తూరి ఫంక్షన్ హాల్లో ఎస్టీయూ మాజీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుబ్బల సత్యనారాయణమూర్తి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయ హక్కులు, సమస్యలపై పోరాడిన గుబ్బల సత్యనారాయణమూర్తి సేవలు మరువరానివని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, పి.సుబ్బరాజు, ఎస్వీ నాయుడు, డి.వెంకటరావు, జవహర్, జీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి అఖండ హోమం


మహా పూర్ణాహుతి పూజల్లో పాల్గొన్న భక్తులు

అమలాపురం రూరల్: పట్టణంలోని విద్యుత్‌నగర్‌లో గౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో 175 రోజులు నిర్వహించిన వారాహి అఖండ హోమం ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన మహాపూర్ణాహుతితో ముగిసింది. అర్చకుల ఆధ్వర్యంలో అఖండదీప, కలశ, పీఠ, ఆవరణ దేవతల ఉద్వాసన, మంత్ర జల సంప్రోక్షణ, మహదాశీర్వాదంతో అఖండ హోమం కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

యానాం: రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పుదుచ్చేరివ్యాప్తంగా ఉన్న రేషన్‌డీలర్లు సీఎం రంగసామి ఇంటి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రేషన్ దుకాణాల ద్వారా ఉచిత బియ్యం తదితర నిత్యావసర వస్తువులు పంపిణీ చేయగా వచ్చే కమిషన్ ఆధారంగా డీలర్లకు జీతాలు ఇచ్చేవారన్నారు. అయితే అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ హయాంలో బియ్యం పంపిణీ స్థానంలో లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో నగదు జమ అమలు చేశారన్నారు. అప్పటి నుంచి రేషన్ డీలర్లకు జీతాలు ఇవ్వడం లేదని నిరసన చేపట్టారు. రంగసామి నిరసనకారులతో మాట్లాడుతూ గత ఏడేళ్ల నుంచి ఏం చేశారంటూ ప్రశ్నించారు. తాను ముఖ్యమంత్రి అయ్యి రెండేళ్లు మాత్రమే అయ్యిందన్నారు.

ఆక్వా రైతులకు బాసట

- అందుబాటులోకి స్థానిక రొయ్యల నర్సరీలు
- మిశ్రమ సాగుకు అనుకూలమైన సీడ్ ఉత్పత్తి
- రైతులకు కావలసిన విధంగా ఉప్పు శాతం సర్దుబాటు


చల్లపల్లిలో రొయ్య పిల్లలను పెంచుతున్న నర్సరీ ట్యాంకులు

ఉప్పలగుప్తం: రైతులను అధిక లాభాల వైపు నడిపించే సాగుల్లో రొయ్యల సాగు ప్రధానమైనది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రొయ్యలు అనేక రకాల వ్యాధులకు గురవ్వుతుండటంతో ఆక్వా రైతులు నిరాశ చెంది మిశ్రమ కల్చర్(పాలీ కల్చర్)ను ఉపయోగిస్తున్నారు. చేప, రొయ్య మిశ్రమ కల్చర్ ద్వారా రైతులు అధిక లాభాలతో అడుగులు వేస్తున్నారు. ఈ మిశ్రమ కల్చర్‌కు అనుగణంగా హేచరీ నుంచి తీసుకొచ్చిన రొయ్య పిల్లల కంటే స్థానికంగా ఉన్న నర్సరీల్లో పెరిగిన రొయ్య పిల్లలతో దిగుబడి శాతం ఎక్కువ వస్తోంది.

ఉప్పు శాతం మార్పే కీలకం

హేచరీల్లో పెరిగిన రొయ్య పిల్లలకు నీటిలో 10 నుంచి 15 పీపీటీ సెలనిటీ(ఉప్పు ద్రావణం) ఉంటుంది. చేపలు ముఖ్యంగా సున్నా నుంచి ఐదు సెలనిటీ నీటిలో ఆరోగ్యంగా జీవించగలవు. అయితే హేచరీ నుంచి తీసుకొచ్చిన రొయ్య పిల్లలను ఈ మిశ్రమ సాగు చేస్తున్న చెరువుల్లో వదిలితే అవి అప్పటివరకు అధిక ఉప్పు శాతంలో పెరగటంతో ఉప్పు శాతం తక్కువ ఉండేసరికి అనారోగ్యంతో మృతి చెందుతున్నాయి. అందుకే నర్సరీల్లో పెంచిన రొయ్య పిల్లలను నీటిలో ఉప్పు శాతాన్ని తగ్గిస్తూ రైతు పెంచే వాతావరణానికి అనుగుణంగా క్రమేపి అలవాటు చేస్తున్నారు. ఇలా చేయటంతో పాలీ కల్చర్ చేస్తున్న రైతులు రొయ్యల జీవిత కాల నిలుపుదలపై ఆశలు పెంచుకుని సాగు సాగిస్తున్నారు. దీంతో అటు చేపకు ఇటు రొయ్య సాగుకు మంచి లాభాలు చేకూరడంతో పాటు నర్సరీ వ్యాపారులకు మంచి ఫలితాలనిస్తున్నాయి.

నర్సరీల్లో అలవాటు చేస్తున్నారిలా..

అర ఎకరా ప్రాంతాన్ని 3 అడుగుల లోతులో 6 నుంచి 8 గుంటలు(నర్సరీ చెరువులు) గా విభజిస్తారు. ఆ చెరువుల్లో 15 పీపీటీ ఉప్పు శాతం ఉన్న నీరును నింపుతారు. అదే సెలనిటీతో కోస్టల్ ఏరియాల్లో అందుబాటులో ఉన్న హేచరీల నుంచి 9 రోజుల పిల్లలను తీసుకొచ్చి ఒక్కొక్క గుంటకు 8 నుంచి 10 లక్షల రొయ్య పిల్లలను ఈ నర్సరీల్లో వదులుతారు. వాటిని రోజూ జీరో సెలనిటీ పీపీటీ ఉన్న పంట కాలువ(స్వీట్ వాటర్) నీటిని నింపి అదే తరహాలో ఉప్పు నీటిని తగ్గిస్తారు. ఈ ప్రక్రియ దాదాపుగా పది రోజుల వరకూ కొనసాగుతుంది. ఈ నర్సరీలో పెరుగుతున్న రోజుల్లో పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందిస్తారు. హేచరీల్లో ఏ తరహాలో నిర్వహణ చేస్తారో అదే తరహాలో వాటిని సంరక్షిస్తూ చేప, రొయ్యల మిశ్రమ సాగుకు అనుగుణంగా తయారు చేసి విక్రయిస్తారు. దీంతో రైతుకు అనుగుణంగా రొయ్య పిల్ల లభించడంతో పాటు సాగులో పదిరోజుల కాల వ్యవధి కలిసొచ్చి దిగుబడి ముందుగా వస్తుంది.

మంచి లాభాలు వస్తున్నాయి


హేచరీ నుంచి నేరుగా చెరువుల్లో వేయటం కంటే ఈ నర్సరీల్లో పెంచిన పిల్లలు చేప, రొయ్య మిశ్రమ సాగుకు చాలా అనువుగా ఉంటున్నాయి. దాదాపుగా 10 రోజులు కాలం కలిసి వస్తుంది. ముందస్తుగా సాగు దిగుబడి వస్తే మంచి లాభాలు వస్తున్నాయి.
– కర్రి శ్రీనివాసరావు, ఆక్వా రైతు, సామంతకుర్రు, అల్లవరం మండలం

స్థానికంగానే ఉపాధి


ఈ ప్రత్యేక రొయ్య పిల్లల నర్సరీల ద్వారా స్థానికంగా గ్రామంలోనే ఉపాధి పొందొచ్చు. సంవత్సరానికి రూ.8 నుంచి 10 లక్షల ఆదాయం లభిస్తుంది. క్వాలిటీ రొయ్య పిల్లలు తెచ్చి రైతులకు భరోసాగా ఇవ్వగలుగుతున్నాం. ఈ నర్సరీ ట్యాంకుల నిర్వహణతో మరో పదిమందికి ఉపాధి దొరుకుతుంది.
– నల్లా నాయుడు, నర్సరీ నిర్వాహకుడు, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

వ్యాధులను ముందుగా గుర్తించొచ్చు


రొయ్య పిల్లలను హేచరీ నుంచి నేరుగా కంటే ప్రతి రైతు నర్సరీల్లో వేసి చెరువుల్లో వదలటంతో వాటికి వచ్చే వ్యాధులను ముందుగా గుర్తించొచ్చు. అంతేకాదు వాటి ఎదుగుదలను బట్టి సరి చూసుకుని ఆహారాన్ని అందించొచ్చు. దీని ద్వారా రైతు సమయాన్ని, ఖర్చును ఆదా చేసుకోగలుగుతాడు.
– సీహెచ్ గోపాలకృష్ణ, మత్స్యశాఖాధికారి, అమలాపురం

ప్లాస్టిక్ డ్రైయిన్


అమలాపురం వెత్సావారి అగ్రహారంలోని డ్రైయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు


అదే డ్రైయిన్‌ను శుభ్రం చేశాక మురుగు నీరు వేగంగా పారుతున్న దృశ్యం

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో పారిశుధ్య సిబ్బంది తరుచూ డ్రెయిన్లను శుభ్రం చేసినప్పుడల్లా ఇతర చెత్తా చెదారం కంటే ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువగా వస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులు ఎన్ని జరిమానాలు విధిస్తున్నా, హెచ్చరిస్తున్నా, చైతన్య పరుస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. పట్టణంలోని వెత్సావారి అగ్రహారంలోని ఓ డ్రెయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు మురుగు నీరు కంటే అధికంగా అట్టలా పరుచుకుపోయాయి. అదే డ్రెయిన్‌ను పారిశుధ్య సిబ్బంది ఆదివారం ఉదయం శుభ్రం చేశాక దాంట్లో మురుగునీరు వేగంగా ప్రవహించింది. ఇది గమనించైనా పట్టణ ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపితే ప్లాస్టిక్ డ్రెయిన్ల బాధ తప్పుతుంది.

మహిళా మార్ట్‌తో ఆర్థిక పరిపుష్టి


కోరంగిలో ఏర్పాటు చేస్తున్న చేయూత మహిళా మార్ట్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ సునీత

తాళ్లరేవు: మహిళల ఆర్థిక పరిపుష్టికి 'చేయూత మహిళా మార్ట్' దోహదపడుతుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. ఆదివారం ఆమె కోరంగిలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న చేయూత మహిళా మార్ట్‌తో పాటు అదే ప్రాంగణంలో నిర్మిస్తున్న రెస్టారెంట్‌ను పరిశీలించారు. మార్ట్ ద్వారా చేపట్టనున్న చర్యలను అకౌంటెంట్ చెక్కా మహేష్, స్టోర్ మేనేజర్ తాతపూడి మహేష్‌లు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన వారికి ఈ మార్ట్ ద్వారా తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులు అందించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు తయారు చేసే వస్తువులను సైతం మార్ట్ ద్వారా విక్రయించి ఆయా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మున్సిపల్ కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలకు స్వచ్ఛత అవార్డుల కోసం వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆదివారం వెల్లడించారు. స్వచ్ఛ భారత్ మిషన్, రాష్ట్ర పుర పాలక శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమం ద్వారా వుమెన్ ఐకాన్స్ లీడింగ్ స్వచ్ఛత-2023 అవార్డులు మహిళలకు ప్రదానం చేయనున్నామని తెలిపారు. పట్టణంలోని వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి ఉపయోగించే పద్ధతులు, పొడి చెత్తను వినూత్న రీతిలో వాడడం, తడి చెత్త నుంచి సంపద తయారీ, చెత్తతో కళాకృతులు, సేంద్రియ ఎరువుల తయారీ, నూతన ఆవిష్కరణల విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు ఈ అవార్డులకు అర్హులని కమిషనర్ నాయుడు స్పష్టం చేశారు. పట్టణంలో ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 22వ తేదీ లోపు అన్ని వార్డు సచివాలయాల్లో ఉన్న పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులకు దరఖాస్తులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వచ్చే జూన్ 5న ఈ అవార్డులను విజయవాడలో రాష్ట్ర పురపాలక శాఖ అందించనుందని చెప్పారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన ర్యాలీ


ప్రకృతి విపత్తులపై చేపట్టిన అవగాహన సైకిల్ ర్యాలీ

యానాం: ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆపదమిత్రల వలంటీర్లతో చేపట్టిన అవగాహన సైకిల్ ర్యాలీని స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం వద్ద ఆర్ఏఓ మునిస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరప్రాంతమైన యానాం పరిసర ప్రాంతాల్లో తరుచూ సంభవిస్తున్న తుఫాన్లు, వరదలు, సునామీలు తదితర విపత్తులను ఎదుర్కొనేందుకు తగు సూచనలు, సలహాలు, రక్షణ ఏర్పాట్లను అందించేందుకు ప్రభుత్వం ఆపద మిత్రలను స్వచ్ఛందంగా నియమించినట్లు తెలిపారు. వీరందరికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో 12 రోజుల పాటు శిక్షణ అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా కమ్యూనిటీ వలంటీర్ల నియామక ఉద్దేశాలు, క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స, కమ్యూనికేషన్స్, రెస్క్యూ ఆపరేషన్స్ తదితర విషయాల గురించి వివరించామన్నారు. అనంతరం జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డీటీ గణేషన్, ఆరోగ్య, ఫైర్, పోలీసు తదితర శాఖల సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ రీజియన్–3 సేవలు అభినందనీయం


రీజనల్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: అంతర్జాతీయ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవల్లో భాగంగా రీజియన్–3 చేస్తున్న సేవలు అభినందనీయమని జోన్ చైర్మన్ రమేష్ రాజు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో జరిగిన లయన్స్ క్లబ్ రీజనల్ కాన్ఫరెన్స్‌కు రమేష్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రీజియన్ చైర్మన్ నున్న దత్తు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 14 లయన్స్ క్లబ్‌లు ఏడాది కాలంగా చేసిన సేవా కార్యక్రమాలపై సమీక్షించి ఉత్తమ సేవలు అందించిన క్లబ్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, ప్రతినిధులు వేలూరి సూర్యనారాయణ, ఈశ్వర్ కుమార్, చోడే శ్రీనివాస్, ధూళిపూడి వెంకట రమణ, నడింపల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలి


మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన విశ్వహిత సేవా ట్రస్ట్ సభ్యులు

యానాం: భారతీయ సంస్కృతి, హిందూ సంప్రదాయాలు, విలువలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కెనడాకు చెందిన విశ్వ హిందూ పరిషత్ నేత నర్సింహాచార్యులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కురసాంపేట కమ్యూనిటీహాలులో విశ్వహిత సేవా ట్రస్ట్, విశ్వ హిందూ పరిషత్ కోనసీమ విభాగం ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం కురసాంపేట మహిళా మండలి సెక్టార్‌కు నాలుగు టైలరింగ్ మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కనకాల రామదాసు, అడ్వకేట్ సత్యదేవి, ఆర్ఎస్ఎస్ సభ్యులు చంద్రు శ్రీనివాసరావు, ఆదిమూలపు శ్రీను, విజయలక్ష్మీపండిట్, తలాటం సత్యసుజాత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆ సెంటర్‌లో టెన్షన్


ప్రమాద భరితంగా ఉన్న ముక్కామల నాలుగు రోడ్ల సెంటర్

అంబాజీపేట: ముక్కామల నాలుగు రోడ్ల సెంటర్‌లో ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేవని తక్షణమే ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ఈదరపల్లి నుంచి కొత్తపేట వెళ్లే వాహనాలు ముక్కామల సెంటర్ వద్దకు వచ్చేసరికి కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారం నడుపుతున్నారని, ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంతో హడలిపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే నాలుగు రోడ్ల సెంటర్‌లో స్పీడు బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పెంచాలి


సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

తాళ్లరేవు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎటువంటి అవినీతికి తావు లేకుండా, నాణ్యతా ప్రమాణాలు పెంచే విధంగా అధికారులు పర్యవేక్షణ చేయాలని డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి సూచించారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. మండలంలో సుమారు 15 రోజులపాటు నిర్వహించిన సామాజిక తనిఖీ వివరాలను డీఆర్‌పీలు వెల్లడించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ 2021–22 సంవత్సరానికి సంబంధించి 1025 పనులు చేసారని, దీని ద్వారా రూ.31.61 కోట్లు చెల్లించామన్నారు. ఆ నిధులతో పలు పంచాయతీల్లో సచివాలయాలు, ఆర్బీకే భవనాలు, స్కూల్ కాంపౌండ్ వాల్స్ నిర్మించారన్నారు. ఉపాధి పనుల్లో నాణ్యతను పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, అంబుడ్స్‌మెన్ జ్యోతి, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వైభవంగా జనార్దనస్వామి కల్యాణం

ఆలమూరు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక ఆలయ ఆవరణలో వేద పండితులు పెద్దింటి వెంకటరమణ ఆచార్యులు, పెద్దింటి విశ్వనాథశాస్త్రి, అంగర సింగరాచార్యులు, అంగర సత్యనారాయణచార్యులు మంత్రోచ్ఛారణల మధ్య దేవతామూర్తుల విగ్రహాలకు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాయని అనురాధ గాత్ర కచేరి విశేషంగా ఆకట్టుకుంది. వంటిపల్లి విశ్వనాథం, వెత్సా నెహ్రూ, సుబ్బరాజు సహకారంతో ఆలయ కమిటీ ఈ మహోత్సవాలను నిర్వహించింది.

వర్షంతో కర్షకుల హర్షం


ఉప్పలగుప్తంలో వరిచేలపై అల్లుకున్న కారు మబ్బులు

ఉప్పలగుప్తం: మండలంలో శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రబీ సాగు నిమిత్తం అధికారులు వంతుల వారీగా సాగునీటి విధానాన్ని పాటిస్తున్నా మండలంలోని అనేక గ్రామాల్లో నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ఉపరితల ద్రోణి, ఆవర్తనాల ప్రభావంతో ఆదివారం నాటికి మండలంలో 35.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో అన్నదాతలంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం కారణంగా వరి పంటకు ఎటువంటి నష్టం జరగదని, సాగునీరు పుష్కలంగా లభించని రైతులకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు చెప్పారు. ప్రస్తుత వర్షానికి దోమ తగ్గే అవకాశం ఉన్నా, ఆకు ముడత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో దాన్నుంచి తప్పించుకోవడానికి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేయాలి

తాళ్లరేవు: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకులు కేఎస్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ టి.ఈశ్వరరావు, వి.రాజబాబు, పి.కృష్ణ, అదృష్టదీపుడు, భాస్కరరావు, తణుకురాజు, రాంబాబు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా వెంకట్


బండి వెంకట్

అమలాపురం రూరల్: గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ టైపిస్ట్‌ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం ఎన్నికల్లో అమలాపురం ఆర్డీవో కార్యాలయం టైపిస్ట్ బండి వెంకట్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. వెంకట్‌ను ఆర్డీవో వసంతరాయుడు, రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి తదితరులు అభినందించారు.

తాటాకిల్లు దగ్ధం

రూ.3 లక్షల ఆస్తి నష్టం


అగ్నిప్రమాదంలో కాలిపోయిన తాటాకిల్లు

అల్లవరం: సామంతకుర్రు పంచాయతీ పరిధిలోని నీలగిరి కాలనీలో కొప్పాడి కనకరాజుకి చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. బాధితులను సర్పంచ్‌లు సుందరనీడి సాయి, కొల్లు వెంకటరమణ, ఎంపీటీసీ కర్రి సత్య శ్రీను తదితరులు పరామర్శించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

తాళ్లరేవు: ఒక వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ప్రధాన రహదారిలోని పోస్టాఫీసు సమీపంలో వృద్ధురాలైన యాళ్ల సూర్యకాంతం తన కుమార్తె ఇంటికి నడిచి వెళుతుండగా తెలుపు రంగు మోటార్ బైక్ వచ్చిన ఇద్దరు వ్యక్తులు అకస్మాత్తుగా బంగారు గొలుసును లాక్కుని యానాం వైపుకి వెళ్లిపోయినట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.40 వేలకు పైగా ఉంటుందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితునికి ఆర్థిక సాయం


సాయం అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

రావులపాలెం: కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక శ్రీ కాశీఅన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.10 వేలు సాయం అందజేశారు. రావులపాలెం కాలువ అవతల గల అంధుల హాస్టల్ నిర్వాహకుడు సింహాద్రి కొన్ని రోజులుగా కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం శ్రీ కాశీ అన్నపూర్ణా దేవి సేవా సమితి సభ్యు లు ఆదివారం అతని ఇంటికి వెళ్లి సాయం అందజేశారు.